


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 10-7-2025

సంపుటి: 21 సంచిక: 92
పేజీలు: 8 వెల: రూ.1



ఆయన ఒక ఎన్జీవో సంస్థకు జిల్లా పర్యవేక్షకుడు. ప్రభుత్వ సంస్థకు అనుబంధంగా పని చేస్తూ రోగులకు ఆ సంస్థ సేవల గురించి వివరించడం, వారిని ఆయా కేంద్రాలకు తీసుకెళ్లి టెస్టులు, కౌన్సెలింగ్ చేయించడం, అవసరమైన మందులు ఇప్పించడం వంటి కార్యకలాపాలను తన కింది సిబ్బంది ద్వారా చేయిస్తూ, అవి సక్రమంగా జరుగుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించడం ఆయనగారి బాధ్యత. కానీ ఆయనగారు ఆ పని ఎలా చేస్తున్నారో గానీ.. తన కింది సిబ్బందితో తనకు సేవలు చేయించుకుంటున్నారు. పైగా వారిని దుర్భాషలాడుతూ, అవమానపర్చడమే కాకుండా కులవివక్ష కూడా చూపిస్తున్నారు. మూడు నెలల క్రితమే విధుల నుంచి తప్పించినా జిల్లావ్యాప్తంగా తనకున్న పరిచయాలతో ఉద్యోగులకు బెదిరిస్తూ, వారి పనులు కానివ్వకుండా చేస్తూ వేధిస్తున్నాడు. ఇతగాడి ఆగడాలు భరించలేక సదరు ఉద్యోగులు ఏకంగా జిల్లా కలెక్టర్‌కే మొరపెట్టుకోవాల్సి వచ్చింది.

# సాధింపులు..వేధింపులే..

# ఆయనకు 'భూషణా'లు!

- -తోటి సిబ్బందిని రాచి రంపాన పెడుతున్న అధికారి
- -మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యవర్తన
- -కులం, రాజకీయ పరపతితో పీవోనే లెక్కచేయని తత్వం
- -విధుల నుంచి తొలగించిన మళ్లీ రావడానికి యత్నాలు
- - కలెక్టర్‌కు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ల ఫిర్యాదు

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ఎయిడ్స్ నియంత్రణ కార్యకలాపాల్లో భాగస్వాములమవుతున్న తమను.. పై అధికారిగా పని చేసిన వ్యక్తి రకరకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని చైల్డ్ ఫండ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ(ఎన్జీవో)కు చెందిన 16మంది లింక్ వర్కర్స్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్) పరిధిలో చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ పని చేస్తోంది. తనకు అప్పగించిన ప్రాంతాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను, ఆ లక్షణాలు ఉన్నవారిని, హెచ్ఐవీ బాధితుల పిల్లలను గుర్తించి సమీప ఏఆర్టీ సెంటర్లకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించి, టెస్టులు చేయించడం, పాజిటివ్ వచ్చిన వారికి మందులు ఇప్పించడం వంటి బాధ్యతలను ఏపీశాక్స్ పరిధిలోని ఎన్జీవో సంస్థలు నిర్వర్తించాల్సి ఉంది. ఎన్జీవో పరిధిలో ఈ పనులు చేస్తున్న వారిని లింక్ వర్కర్స్ అంటారు. వీరిని పర్యవేక్షిస్తూ, పనులు సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత జిల్లా హెడ్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)ది. శ్రీకాకుళం జిల్లాలో నాలుగు నెలల క్రితం వరకు ఈ పనులు నిర్వర్తించి చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ డీఆర్పీ హనుమంతు నాగభూషణరావుపై ఆయన కింద పని చేసిన లింక్ వర్కర్లే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

### వేధింపులు, వికృత చేష్టలు

డీఆర్పీగా జిల్లావ్యాప్తంగా పర్యటిస్తూ ఫీల్డ్ విజిట్‌లు చేసే నాగభూషణరావు, తన పర్యటనలకు సంస్థ ఖర్చులు చెల్లిస్తున్నా.. తన కింద పని చేసే లింక్ వర్కర్లను వాడేసుకుంటున్నారు. ఈయనగారు జిల్లా కేంద్రం నుంచి ఫీల్డ్‌కు బయలుదేరేటప్పుడు ఇక్కడి ఉద్యోగి ఒకరు తన బైక్‌పై బస్టాండ్‌కు అలాగే ఇంటి నుంచి ఆఫీసుకు వచ్చేటప్పుడు కూడా తీసుకురావడం, తీసుకెళ్లడం చేయాల్సి ఉంటుంది. అలాగే ఫీల్డ్ పర్యటనకు వెళ్లేటప్పుడు ఆయా ప్రాంతాల్లో ఆయన బస్సు దిగగానే.. అక్కడి ఉద్యోగుల్లో ఒకరు ఆయన్ను బైక్ ఎక్కించుకుని ఆయన్ను ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. తిరిగి బస్సు ఎక్కించే వరకు బాధ్యత సదరు ఉద్యోగిదే. డీఆర్పీకి విపరీతమైన కులపిచ్చి ఉందని ఫిర్యాదులో ఆరోపించారు. తన మాటల్లో తరచూ కులం ప్రస్తావన వస్తుంటుందని, తన కులం కానివారిని చిన్నచూపు చూస్తూ వేధించేవారు. తన మాట వినని వారికి కావాలనే ఎక్కువ పనులు అప్పగించి ఒత్తిడి పెంచి ఇబ్బందులకు గురి చేసేవారు. కాగా మహిళ ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను చెప్పిన వారి వద్దకు వెళ్లాలని ఒత్తిడి చేస్తుంటారని, అలాగే వర్కర్ల ఇళ్లకు హోం విజిట్ పేరుతో వెళ్లి.. వారి స్థితిగతులు, వ్యక్తిగత విషయాలు తెలుసుకుని వారిపట్ల అనుచితంగా ప్రవర్తించేవారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాలను వివరిస్తూ డీఆర్పీ తీరుపై గతంలో చైల్డ్ ఫండ్ ఇండియా రాష్ట్ర ప్రాజెక్టు అధికారి(పీవో)కి, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్స్ కంట్రోల్ యూనిట్ డీఎల్‌వో దృష్టికి తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### నాలుగు నెలల క్రితం తొలగింపు

తమ ఫిర్యాదులపై స్పందించిన పీవో శ్రీరామ్ శ్రీనివాస్ వర్చువల్‌గా డీఆర్పీ నాగభూషణరావుతో మాట్లాడి ప్రవర్తన, పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కానీ డీఆర్పీ ఆ తర్వాత నుంచి ఇంకా ఎక్కువగా వేధించడం ప్రారంభించారు. మళ్లీ ఈ విషయాన్ని పీవో దృష్టికి తీసుకెళ్లగా 16 మంది నుంచి లిఖితపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. వాటికి వివరణ ఇవ్వాలని డీఆర్పీని కోరగా.. 'నా లెవల్ వేరు, నాకు పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉంది. దీన్ని ఏవిధంగా హ్యాండిల్ చేయాలో నాకు తెలుసు అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పీవో మూడు నెలల గడువు ఇచ్చి పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈ ఏడాది మార్చిలో డీఆర్పీ నాగభూషణరావును విధులకు రాకుండా నిలిపివేశారు. అయినా ఆయన ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. అధికారిక విధుల నిర్వహణ కోసం ఏపీశాక్స్ ఇచ్చిన ల్యాప్‌టాప్‌ను ఇంతవరకు తిరిగి ఇవ్వకుండా తనవద్దే ఉంచుకున్నారు. అలాగే తనపై ఫిర్యాదు చేసిన లింక్ వర్కర్లపై బయట నుంచే కక్ష సాధింపు చర్యలు మొదలుపెట్టారు. ఐసీటీసీ కేంద్రాల్లో తనకు పరిచయం ఉన్న, తన కమ్యూనిటీకి చెందిన పలువురు కౌన్సెలర్ల ద్వారా లింకు వర్కర్లు తీసుకువచ్చే పేషెంట్లకు కౌన్సెలింగ్ ఇవ్వకుండా, వారికి రక్తపరీక్షలు చేయకుండా అడ్డుకుంటున్నారు. వర్కర్లలో కొందరిని తన రాజకీయ - మిగతా లోపలి పేజీలో



ప్రముఖ రచయిత, నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు, నెయ్యిల ఉమామహేశ్వరరావులు రచించిన 'మా దేవుడు మీరే మాస్టారు' పుస్తకంను ఎస్.బి.ఐ చీఫ్ మేనేజర్ సి.హెచ్.ప్రసాదరావుకు గురువారం బహుకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, దాత మెండ తవుడు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## సమస్యల పరిష్కారానికి దిక్సూచి

**- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**

**(సత్యంన్యూస్, పాతపట్నం)**

పాఠశాలల బలోపేతానికి, విద్యార్థి వికాసానికి, సమస్యల పరిష్కారానికి మెగా పేరెంట్ మీటింగ్ ఒక దిక్సూచిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గం కేంద్రంలోని దువ్వార వీధి హైస్కూల్‌లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా గురువారం నిర్వహించిన పాఠశాల స్థాయిలో మెగా పేరెంట్, టీచర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మెగా పీటీఎం సరికొత్త అధ్యాయమన్నారు. రాజకీయాలకతీతంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకొని ముందుకు నడిపించేందుకు ఈ సమావేశాలు ఉపయోగపడాలన్నారు. ఈ ఆత్మీయ సమావేశాలు తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి దాతలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సలహాలు సూచనలు ఇచ్చి విద్యావ్యవస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశాల ద్వారా పిల్లల చదువులు, ప్రవర్తన, క్రమశిక్షణ తల్లిదండ్రుల ప్రోత్సాహం పాఠశాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తమ గురుతుల బాధ్యతను నిర్వహించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న విద్యా వ్యాప్తిని ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లాను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**- పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం**
**- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

జిల్లాను దేశానికే, ప్రపంచానికే ఆదర్శంగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. గురువారం గార జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ డే సమావేశానికి ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి వలస వెళ్లకుండా ఇక్కడే పని చేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పెట్టుబడిదారులు ఆనందంగా ముందుకు రావాలంటే మన దగ్గర నైపుణ్యం ఉన్న మానవ వనరులు అవసరమన్నారు. పాఠశాలల్లో సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అయన తండ్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఇదే పాఠశాలలో చదువుకున్నారని గుర్తు చేశారు. ఈ పాఠశాలకు రావడానికి ఇదే ప్రధాన కారణమన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలంటే విద్యారంగాన్ని అభివృద్ధి చేయడమే కీలకమన్నారు. గత పాలకులు మాత్రం పాఠశాల గోడలపై, పిల్లల పుస్తకాలపై, బ్యాగులపై తమ ఫోటోలు ముద్రించుకొని ఆదర్శాలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ 2047 వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. మెరుగైన సమాజం కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల పాత్ర కీలకమని, వీరి ముగ్గురి మధ్య సమన్వయం కోసమే ఈ మెగా పేరెంట్ టీచర్ డే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రపంచానికి అవసరమైన మానవ వనరులను అందించేందుకు ఇప్పటినుంచే ప్రయత్నం జరుగుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకి తల్లిదండ్రులు ఇచ్చే అతిపెద్ద ఆస్తి చదువేనన్నారు. ప్రభుత్వం చదువుకు ప్రోత్సాహం ఇస్తోందని తెలిపారు.

### విద్యార్థులతో ముఖాముఖి

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థి గోపీచంద్‌కు విద్యార్థి నేషనల్ మెరిట్ అండ్ మీన్స్ స్కాలర్‌షిప్ కింద రూ.12వేలు వచ్చినట్లు తెలుసుకొని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమలచైతన్య లీప్ యాప్‌లో విద్యార్థి, ఉపాధ్యాయునికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలియజేశారు. కేంద్రమంత్రి లీప్ యాప్‌ను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతి పాఠశాల ప్రగతిని వివరించారు. రాధాకృష్ణ మిషన్ ద్వారా విద్యార్థులందరికీ పుస్తకాలు అందించినట్లు చెప్పారు. గెదెల ప్రేమిక షైనింగ్ స్టార్‌గా ఎంపికై రూ.20వేలు పారితోషికాన్ని అందుకున్నట్లు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎన్‌సీఎస్‌లో పేరెంట్స్ మీటింగ్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక న్యూ సెంట్రల్ స్కూల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ మీట్ 2.0ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన తల్లిదండ్రులకు వారి పిల్లలచే పాదపూజ కార్యక్రమం నిర్వహించి, ఈరోజు విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్లు శ్రీకాంత్, శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మొదటి గురువు అమ్మేనని అటువంటి అమ్మను పూజించడం అంటే ఎంతో ఉన్నతమైందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్కడికి కోఆర్డినేటర్లు వైవిఎస్ఎన్ మూర్తి, సరోజినీ వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు తదితర ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో సమస్యలపై ధర్నా



(సత్యంన్యూస్,పలాస)

ఆంధ్ర,ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించి గ్రామాలు అభివృద్ధి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మందస మండల అధ్యక్ష, కార్యదర్శులు సవర గురునాథ్, సవర ఫల్గునరావు డిమాండ్ చేశారు. గురువారం గిరిజన గ్రామాల సరిహద్దు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మందస తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసి గిరిజనులు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సాబకోట, చీపి, బుడార్‌సింగి పంచాయతీ పరిధిలోగల మాణిక్యపట్నం, మధ్యకల్లు దాల్సరి, కొండమేర, గుడ్డికోల గ్రామాలలో గిరిజనులు తరతరాలుగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నా సరిహద్దుల్లో భూముల సమస్యకు పరిష్కారం చూపించడం లేదన్నారు. ఒడిశా గ్రామాలు సరిహద్దులు దాటి ఆంధ్ర భూభాగంలో నిర్మిస్తూ సరిహద్దు గ్రామాల్లోని భూములను, చెరువులను, స్మశానాలను, పంటకాలువలను, రోడ్డులను ఒడిశా ప్రభుత్వం అండతో ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో మాణిక్యపట్నం అంగన్వాడి కేంద్రానికి ఒరిస్సా అధికారులు తాళం వేశారని దానిని ప్రశ్నించినందుకు గురునాథ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి ఒడిశా ప్రభుత్వం జైల్లో నిర్బంధించిందన్నారు. మాణిక్యపట్నం మీదుగా ఒడిశా వేసే రోడ్డు వల్ల పంట కాలవలు పాడైనా అధికారులు పట్టించుకోలేదన్నారు. సరిహద్దులు దాటి ఒడిశా అధికారులు వచ్చి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి యన్.గణపతి, సవర కైలాస్, సవర తుంబేస్, సవర వాసు, మట్ట ధర్మారావు, కేశవరావు ,దుర్యోధన, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



మండలం వంశధార నదిలో కళింగపట్నం-వమరవెల్లి ఎత్తిపోతల పథకం జరుగుతున్న పనులను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.**- సత్యంన్యూస్, గార**

• ఎడిటోరియల్

# పోలవరం-బనకచర్ల విఫల విన్యాసమేనా!

పాలకులు ఏదో చేస్తున్నామని చెప్పకోవడానికి, సొంత ప్రచారానికి రకరకాల విన్యాసాలు చేయడం, అలవిమాలిన హామీలు ఇవ్వడం తెలిసిందే. ఈ క్రమంలో నేలవిడిచి సాము చేసిన, చేస్తున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. అటువంటి విన్యాసాన్నే ప్రస్తుత చంద్రబాబు సర్కారు చేస్తోంది. అ విన్యాసం పేరే పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు. చాలాకాలంగా ప్రతిపాదనల్లో ఉన్న నదుల అనుసంధానం, గోదావరి జలాల తరలింపు ద్వారా కరువు పీడిత రాయలసీమకు మేలు చేయడం, వృథాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడం అన్న త్రిముఖ లక్ష్యాలతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంటోంది. గత వైకాపా ప్రభుత్వం సంక్షేమం తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదని ఎన్డీయే కూటమి పార్టీలు విమర్శిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పుకోవడానికేనన్నట్లు చాలా హడావుడిగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును సీఎం చంద్రబాబు తెరపైకి తెచ్చారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, పర్యావరణ, న్యాయపరమైన ఇబ్బందులు, అంతర్ రాష్ట్ర నదీజల వివాదాలు వంటి పలు అవరోధాలు ఏర్పడతాయన్న విషయాన్ని ఆలోచించకుండానే, పూర్తి స్థాయి అధ్యయనం చేయకుండానే ఈ ప్రాజెక్టు ప్రతిపాదలను ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కానీ ఈ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యంకాదని, ఇందులో అనేక చిక్కుముడులు ఉండటం వల్ల ఇది మరో కాళేశ్వరం ప్రాజెక్టుగా వృథాగా మిగిలిపోయే ప్రమాదం ఉందని నీటిపారుదల రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా వేల కోట్ల వ్యయంతో గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. ఎటువంటి అనుమతులు లభించకుండానే హడావుడిగా నిర్మించిన ఈ ప్రాజెక్టు అడుగడుగునా నిర్మాణ లోపాలు, ఇతరత్రా కారణాలతో దాదాపు నిరుపయోగంగా మారింది. ఇప్పుడు చంద్రబాబు ప్రతిపాదిత పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కథ కూడా అలాగే అవుతోందేమోనన్న ఆందోళన, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలకు తగినట్లే తెలంగాణ నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ పునర్విభజన చట్టానికి, గోదావరి నదీజలాల ఒప్పందానికి ఇది పూర్తి విరుద్ధంగా ఉందని.. కేంద్ర జలసంఘం నుంచి గానీ గోదావరి జల వివాదాల ట్రిబ్యూనల్ నుంచి గానీ అనుమతి తీసుకోలేదని, ఎగువ రాష్ట్రాల అంగీకారం లేకుండా నిర్మిస్తున్నారన్నవి తెలంగాణ అభ్యంతరాలు. కానీ ఈ అభ్యంతరాలను ఏపీ ప్రభుత్వవర్గాలు కొట్టిపారేస్తున్నాయి. నికర జలాలపై దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కే పూర్తి హక్కులు ఉంటాయని అంటూ ఏటా గోదావరి నుంచి వర్షాకాలంలో సుమారు రెండువేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయని, అందులో కేవలం వంద టీఎంసీలనే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు తరలిస్తామని ఆంధ్ర సర్కారు వాదిస్తోంది. కానీ మిగులు జలాలకు సంబంధించి తాజా లెక్కలు, నివేదికలు లేకుండా ప్రాజెక్టు అనుమతి ఇవ్వడం కుదరదని ఇటీవలే కేంద్ర జలవనరుల సంఘం తిరస్కరించింది. కాగా ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, దట్టమైన నల్లమల అడవి గుండా 19.5 కి.మీ. నిడివిన భారీ పైపు లైన్లు వేయాల్సి ఉంటుంది. 18వేల ఎకరాల్లో అడవులు కొట్టేయాల్సి ఉంటుంది. దీనివల్ల తీవ్రమైన పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే ఈ ప్రాజెక్టు నిర్వహణకు 3377 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇప్పటికే విద్యుత్ కొరత ఎదుర్కొంటున్న రాష్ట్రంలో అంత విద్యుత్ సమకూర్చడం సాధ్యమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే దీన్ని దృష్టిలో ఉంచుకునే ఈ ప్రాజెక్టుపై మూడు ప్రాంతాల్లో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ ప్రాజెక్టులో భాగమైన బొల్లాపల్లి రిజర్వాయర్ తక్కువ లోతు ఉంటుంది కనుక అక్కడ ప్రతిపాదించినట్లు విద్యుత్ ప్లాంట్ నిర్మించిన విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యం కాదని విద్యుత్‌రంగ నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ఇదో పెద్ద సమస్యగా మారనుంది. రూ.81,900 కోట్లుగా అంచనా వేసిన ఈ ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర గ్రాంటుపై ప్రధానంగా ఆధారపడటం మరో ప్రధాన సమస్య. అదికాకుండా రూ.41వేల కోట్లను అప్పుల ద్వారా, రూ.16,380 కోట్లు ప్రైవేటు పెట్టుబడులుగా సేకరించాలని నిర్ణయించారు. ఇది అంత సులభసాధ్యం కాదు. అందువల్ల చంద్రబాబు ప్రిస్టేజికి పోకుండా రాష్ట్రంలో ఉన్న పెండింగు ప్రాజెక్టులపై మనసు పెట్టి పూర్తిచేస్తే అదే పదివేలు.

ఫరీద్‌పేట సర్పంచ్

## చెక్ పవర్ పునరుద్ధరణ

(సత్యంన్యూస్,ఎచ్చెర్ల)

ఫరీద్ పేట సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్ర రావు చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని హైకోర్టు అదేశాలు మేరకు జిల్లా పంచాయితీ అధికారి భారతీ సౌజన్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాది హామీ నిధులు చెల్లింపులో చెక్ డ్రాయింగ్ పవర్‌ను దుర్వినియోగం చేశారన్న అభియోగంతో 2022 జూన్‌లో చెక్ పవర్ రద్దు చేశారు. ఫరీద్‌పేట సర్పంచ్‌తో పాటు బడివానిపేట సర్పంచ్ కారిచిన్నతాతారావు చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. తాత్కాలికంగా నిలుపుదల చేసిన చెక్ పవర్‌ను గ్రామ పంచాయితీలో ప్రజల కనీస అందించాల్సి ఉన్నందున సర్పంచుల చెక్ పవర్ రద్దు ఉత్తర్వులను ఉపసంహరించి, పునరుద్ధరించినట్టు ఉత్తర్వుల్లో డీపీఓ పేర్కొన్నారు.

## 11న ప్రజాగ్రీవెన్స్

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)



శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా గ్రీవెన్స్ స్వీకరణ కార్యక్రమాన్ని స్థానిక విశాఖ-ఎ కాలనీలోని కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గొండుశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం అర్బన్, శ్రీకాకుళం, గార మండలాల్లోని ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు కార్యాలయం వద్ద తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

## మబగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

పోలాకి మండలం మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ గురువులను పూజించుకునే గురుపౌర్ణమి రోజున ఈ సమావేశం ప్రభుత్వం నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పెద్దలను గౌరవించుకోవాలన్న సాంస్కృతిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.






## తెలుగు భాష పరిరక్షణ సదస్సుకు శరత్‌బాబు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 12,13 తేదీల్లో కర్నూలు కళాక్షేత్రం వేదికగా జరిగే ఆంధ్రప్రదేశ్ స్థాయి తెలుగుభాష పరిరక్షణ సదస్సుకు శ్రీకాకుళం రచయిత జంధ్యాల శరత్ బాబుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం అయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని జిల్లాల నుంచి భాషావేత్తలు పాల్గొనే ఈ విస్తృత కార్యక్రమంలో ప్రథమ, మాతృ, అధికార, బోధనా భాషా సభలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సమ్మేళనం తీర్మానాలను ఉన్నతాధికారుల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. సదస్సుకు హాజరవుతున్న శరత్‌బాబును జిల్లాకు చెందిన తెలుగు, యువ రచయితల బృందంతో పాటు జయహో తెలుగు సేన-మాధ్యమ నాయకులు, కవితామయం నేతలు అభినందించారు.

## చేపలవీధి స్కూల్‌లో పేరెంట్ మీటింగ్

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

స్థానిక చేపల వీధి నగరపాలక ప్రాథమిక పాఠశాలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం మీటింగ్‌కు 17వ డివిజన్ ఇన్‌చార్జ్ బస్వా రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పిల్లలకు మొదట గురువు తల్లిదండ్రులేనన్నారు. పిల్లల సమస్యలపై తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులుకు ఫోన్ చేసి లేదంటే కలిసి మాట్లాడాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఆర్.అయ్యప్ప, ఇప్పిలి వీధి సచివాలయం అడ్మిన్ సంజీవ్, పాఠశాల హెచ్‌ఎం ఎల్.అర్జున్, ఉపాధ్యాయులు జి.షణ్ముఖరావు, వై.వి.రమణ, ఎస్.కమలకుమారి, బి.కామేశ్వరి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఏడాదిలోనే హామీలన్నీ అమలు చేశాము

(సత్యంన్యూస్,గార)

అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కేంద్ర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తొమ్మిదోరోజు గురువారం గార గ్రామంలో కేంద్ర మంత్రితో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. స్థానిక నాయకులుతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ద్వారా చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని పేర్కొన్నారు. నవ్యంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ఇచ్చిన హామీలను అమలు చేసాం కాబట్టే ధైర్యంగా తొలిఅడుగుతో ప్రజల మధ్యకు వచ్చామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ, వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





ప్రముఖ చలనచిత్ర దర్శకుడు కె. బాలచందర్ జయంతి (జులై 9).. బాలచందర్ దక్షిణ భారతదేశ సినిమాల్లో తమ ముద్రను బలంగా, ప్రబలంగా నమోదు చేసిన దర్శకుడు. రజనీకాంత్ సూపర్‌స్టార్ అవుతారన్న సన్నివేశాన్ని ఎంతోముందే చూసిన దర్శకుడు బాలచందర్. కమల్‌హాసన్‌లో గొప్ప నటుడు ఉన్నాడన్న విషయాన్ని కమల్ హాసన్ కన్నా ముందే చూశారు. చిరంజీవిలో ఉన్న ప్రత్యేకతనూ, ప్రతిభను, జయప్రదలో ఉన్న గొప్పనటిని అందరికన్నా ముందే చూశారు. నాగేష్ (నగేష్ కాదు) ప్రతిభను విపులంగా చూసి వెలికి తెచ్చారు.

కొత్త తరహా సినిమాలను సాహసంతో తీసి విజయవంతమై దక్షిణాదిలో దర్శకుడు అన్న స్థానానికి విలువను పెంచారు బాలచందర్. అప్పటికే తెలుగు, తమిళ్, కన్నడం, మలయాళం రంగాల్లో గొప్ప సినిమా దర్శకులున్నారు. వాళ్ల సరసన బాలచందర్ తన ముద్రను గాఢంగానే వేశారు. మధ్యతరగతి ప్రేక్షకుల్ని లక్ష్యంగా చేసుకుని వాళ్లకు సంబంధించిన ఇతివృత్తాలతో సినిమాలు తీసి రాణించారు బాలచందర్. తన సినిమాల్లోని సంభాషణల్ని, పాత్రల్ని, పాటల్ని, సినిమా ముగింపుల్ని సమాజంలో పెద్ద ఎత్తున చర్చనీయం చేశారు బాలచందర్. అవళ్ ఒరు తొడర్ కదై (తెలుగులో అంతులేని కథ) సినిమా విడుదలైనప్పుడు ఈ సినిమా ఆడదనుకు న్నారు. నటుడు చారుహాసన్ ఈ సినిమా విషయమై నాకు ఒక వాస్తవాన్ని చెప్పారు. అది: అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.జీ.ఆర్ తనకు బాగా దగ్గరైన దర్శకుడు ప.నీలకణ్ణన్‌ను ఆ సినిమాపై నివేదిక అడిగారట. అందుకు నీలకణ్ణన్ "సినిమా ఆడదు వృథా అయిపోతుంది" అని చెప్పారట. విన్న ఎమ్.జీ. రామచంద్రన్ నవ్వి "పిచ్చోడా, ఇది సూపర్ హిట్ అవుతుంది" అని అన్నారట. అదే అయింది. అంతులేని కథ ఒక విజయగాథ అయింది.

# కథ, నటుడు, పాట, సంగీతం...

# ఫర్‌పెక్ట్ అంచనా వేయగల దర్శకుడు!

తనకు సంబంధించినంత వరకూ ఎమ్.జీ.ఆర్. నాణ్యమైన సినిమాల కన్నా జనరంజమైన సినిమాలకే అతి ప్రాధాన్యతను ఇచ్చారు. అలాంటి ఎమ్.జీ.ఆర్. బాలచందర్, మహేంద్రన్ వంటి గొప్ప దర్శకులను ముందుగా పసిగట్టి వాళ్లకు తాను వెన్నుదన్నై నడిపించారు. బాలచందర్ రచయితగా పరిచయమైంది దెయ్‌వత్తాయ్ అన్న ఎమ్.జీ.ఆర్. సినిమాతోనే.

1964లో రచయితగా సినిమాలోకి వచ్చారు బాలచందర్. అంతకు ముందు నాటక రచయితగా పేరు పొందారు. ఏజీలో అకౌంటెంట్‌గా పనిచేశారు. దర్శకుడుగా ఉన్నతస్థాయికి చేరుకున్న చాల కాలం వరకూ కూడా ఆయన ఉద్యోగాన్ని వదులుకోలేదు.

ఎమ్.జీ.ఆర్., సి(శి)వాజీ గణేస(శ)న్ వంటి పెద్ద నటులతో తాననుకున్నది చెయ్యలేనని చిన్నవాళ్లతో, కొత్తవాళ్లతో సినిమాలు తీసి చరిత్ర సృష్టించారు బాలచందర్.

బాలచందర్‌కు పాటల విషయంలో చాల గొప్ప దృక్పథం ఉండేది. ఆయన తన సినిమాల్లో గొప్ప సంగీతాన్ని చేయించుకునే వారు. ముఖ్యంగా సంగీత దర్శకుడు ఎమ్.ఎస్. విశ్వనాద(థ)న్ చేత కొత్త పంథా పాటల్ని చేయించారు. బాలచందర్ వల్ల విశ్వనాదన్ లోంచి మరో విశిష్టమైన పరిణామం బయటకు వచ్చింది. బాలచందర్‌కు మహోన్నతమైన సంగీతం చేశారు విశ్వనాదన్.

ఇళైయరాజా సంచలనం సృష్టిస్తున్న సమయంలో బాలచందర్ విశ్వనాదన్ సంగీతంలో నినైత్తాలే ఇనిక్కుమ్ అన్న పూర్తి సంగీత ప్రధానమైన సినిమా (తెలుగులో అందమైన అనుభవం) తీశారు. కణ్ణదాసన్‌తో ఉన్నతమైన సాహిత్యాన్ని రాయించుకున్నారు. నిమిషాల్లో పాట రాయగల కణ్ణదాసన్ "దెయ్‌వమ్ తన్ద వీడు.." (తెలుగులో "దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి" పాట) పాట రాయడానికి మూడు రోజులు తీసుకున్నారు. అలాంటి సందర్భాన్ని సృష్టించారు బాలచందర్.

ఎ.ఆర్.రహ్మాన్ సంచలన సంగీత దర్శకుడవుతాడన్న దాన్నీ ముందే చూడగలిగారు బాలచందర్. రహ్మాన్ తొలి సినిమా రోజా నిర్మాత బాలచందరే. అందులో "చిన్ని, చిన్ని ఆశ.." పాట సూపర్ హిట్ అవుతుందని అందరికన్నా ముందే తెలుసుకున్నది ఆయనే.

బాలచందర్ ఆకలిరాజ్యం సినిమాలో ఒక హిందీ పాట ఉంది. అది: "తుహి రాజా మే హున్ రానీ / ఫిర్ భీ నహీ హే బాత్ పురానీ.." ఈ పాటకు ఒక పూర్వరంగం ఉంది. మద్రాసులో ఒక కార్యక్రమంలో పీ.బీ. శ్రీనివాస్ ఉర్దూ గజ్‌రా (గజల్ కాదు) పాడారు. ఆ కార్యక్రమానికి బాలచందర్ వచ్చారు. పీ.బీ. శ్రీనివాస్ ఆ గజ్‌రా పాడడం అయిపోయాక%ా

బాలచందర్ వచ్చి "చాలా బాగా పాడారు" అన్నారట. మళ్లీ కాసేపయ్యాక పీ.బీ.ఎస్. దగ్గరకు వచ్చి "చాలా బాగా పాడారు" అని అన్నారట. ఇలా 7, 8 సార్లు జరిగింది ఆ రోజు. మరుసటి రోజు పీ.బీ.ఎస్.కు ఫోన్ చేసి ఆ ఆకలిరాజ్యం హిందీ పాట రాయించుకున్నారు. అంటే ఆ కార్యక్రమంలో గజ్‌రాను విన్నాక ఈ పాటను బాలచందర్ అలోచన చేశారన్న మాట. ఇలా మరికొన్ని సందర్భాలూ ఉన్నాయి. మామూలుగా సంగీత దర్శకులు, గేయ రచయితలకూ మధ్య జరిగే దాన్ని "కన్నె పిల్లవని కన్నులున్నవని.." పాటగా తీశారు బాలచందర్.

బాలచందర్ మంచి సంభాషణల రచయిత. మన ఆత్రేయపై, గణేశ్ పాత్రోపై కూడా బాలచందర్ ప్రభావం పడిందంటే బాలచందర్ సంభాషణల పదను (పదును) ఏమిటో తెలుసుకోవచ్చు.

బాలచందర్‌కు మన కె.విశ్వనాథ్ అంటే విశేషమైన అభిమాన ముండేది. అదీ శంకరాభరణం సినిమా కు ముందే. శంకరాభరణం తరువాత కె. విశ్వనాథ్ గొప్ప వారుగా పరిగణనలోకి రావడం చరిత్ర. బాలచందర్‌కు అంతకు ముందే విశ్వనాథ్ గొప్ప వారని తెలిసింది. బాలచందర్ 'చూడడం' తెలిసిన సినిమా దర్శకుడు.

విశ్వనాథ్ ఓ సీత కథ సినిమాను బాలచందర్ మూన్డు ముడిచ్చు సినిమాగా తమిళంలో చేశారు. ఆ సినిమాతోనే రజనీకాంత్ నటుడుగా నిలబడ్డారు. ఆ సినిమాలోనే నటి శ్రీదేవి నాయికగా పరిచయం అయింది. ఒక సందర్భంలో కె. విశ్వనాథ్‌ను మొత్తం తెలుగు సినిమాకు ప్రతినిధి అని అభివర్ణించారు బాలచందర్.

ఎంతో ఉంది బాలచందర్ గురించి చెప్పడానికి. ప్రస్తుతానికి ఇంతే చెప్పగలుగుతున్నాను. అలవాటైన దానికి అతీతమైన ఆలోచనతో, ఆచరణతో ఒక అగ్రశ్రేణి చలనచిత్ర దర్శకుడుగా చరిత్ర అయ్యారు కె. బాలచందర్!!

- రోచిష్మాన్ 9444012279




అది 2002, లండన్ లార్డ్స్‌లో నాట్ వెస్ట్ సీరిస్.. ఇంగ్లాండ్ వర్సెస్ ఇండియా మ్యాచ్! మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ పెట్టిన టార్గెట్.. 325 భారీ లక్ష్యం.. ఆ రోజుల్లో ఓ టీమ్ 300 రీచవ్వడమే గగన గండం. బ్యాటింగ్‌కు ముందే భారత్ గెలుపుపై సగటు ప్రేక్షకుడు, క్రికెట్ అభిమాని ఆశలు విడుచుకున్నారు. ఇంకోవైపు, అది కరెంట్ కటింగ్స్ అధికంగా ఉన్న కాలం.. మా ఊరు ధర్మపురి అందుకు కేరాఫ్! పెద్దగా టీవీలు కూడా అప్పటికి అందరిళ్లల్లో లేవు. ఎక్కడో తెలిసినోళ్ల ఇళ్లల్లో వెళ్లి చూసే కాలం. ఇక టీవీ వచ్చిందని మురిసిపోయిన మాకు మళ్లీ రేడియోనే దిక్కైంది. తానెంత విలువైందో ఆ సాయం సంధ్య వేళలో ఆ ట్రాన్సిస్టర్ మాకు చెప్పింది! ఇవాళ హాట్ స్టార్ లోనో, జియోలోనో చెబుతున్నట్టు తెలుగు కామెంట్రీ కాలం కాదాయె! హిందీ, ఇంగ్లీష్‌ల్లో కామెంట్రీ వినాల్సిందే! మనకేమో ఆ యాసెంట్ అంత స్పీడుగా అర్థం చేసుకునే స్థాయి లేకపాయె! మా దోస్త్ వంశీ వాళ్ల నాన్న విశ్వనాథం సారే అప్పుడు మాకు దిక్కు. చిమ్మచీకటి.. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియదు. మామూలు రోజైతే కరెంట్ కోసం నిరీక్షణ ఉండేది. ఆరోజు ఎదురుచూస్తున్నా.. మ్యాచ్ మీదున్న చిత్తంతో కరెంట్ పైనుంచి దృష్టి ఎలాగైనా మ్యాచ్ ఫాలో చేయాలన్న తలంపుతోనే సాగింది.

# దాదాను భిన్నంగా పరిచయం చేసిన మ్యాచ్!

## నాట్ వెస్ట్ సిరీస్ ..ఓ మెమరీ!!

ఇంకేం మా విశ్వన్న సార్ పక్కన అరుగుమీద కూర్చుంటే.. ఆయన మాకు చెప్పడం.. యువరాజ్, కైఫ్ రన్స్ కొడుతున్నకొద్దీ విశ్వన్న సార్ ఇంటికెదురుగా ఉన్న ద్యావళ్ల కిషోర్ (చిన్న వయస్సులోనే దివికేగిన) సంతోషపడటం.. ఆ మ్యాచుతో తానెందుకు భారత క్రికెట్‌లో యువరాజో.. యువరాజ్ తెలియజెప్పడం.. మహ్మద్ కైఫ్ బాధ్యతాయుతమైన బ్యాటింగ్ వెరసి 325 రన్స్‌ను భారత్ ఛేదించిన తీరు అమోఘం.

భారత క్రికెట్ జట్టు ఎప్పటికీ మర్చిపోలేని అద్భుతమైన మ్యాచుల్లో లండన్ లార్డ్స్ మైదానపు నాట్ వెస్ట్ సీరిస్‌ది ప్రత్యేక స్థానం.

భారత బౌలర్లను ఇంగ్లాండ్ కెప్టెన్ నాజిర్ హుస్సేన్, మార్కస్ ట్రెస్కోథిక్ ఉతికి ఆరేస్తుంటే ఆ మ్యాచ్ ఇక అంతే సంగతులని ఇంగ్లాండ్ మొదటి బ్యాటింగ్ సమయంలోనే సగటు భారత వీరాభిమానులు చేతులెత్తేసిన విచారకర సందర్భమది.

కానీ, యువరాజ్, కైఫ్ మార్చేశారు. చరిత్రను తిరగారాశారు. అప్పటివరకూ భారత్ ఛేదించని అతి పెద్ద టార్గెట్ 325 రన్స్‌ను ఛేదించి.. కొత్త చరిత్రను సృష్టించారు.


అయితే, ఆమ్యాచ్ కేవలం పరుగులు, వికెట్లు, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో మాత్రమే ముడిపడిందైతే కూడా ఇంతగా చెప్పుకోవాల్సిన పన్లేదు.. కానీ, అది భారత భావోద్వేగాలను ప్రపంచానికి తెలియజెప్పిన ఓ ఉద్విగ్న క్షణం.

ఆనాటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ. భారత క్రికెట్‌కు భావోద్వేగాన్ని నేర్పిన కెప్టెన్. విజయాలకు భారత్‌ను కేరాఫ్ చేసిన కెప్టెన్. ఆస్ట్రేలియాపై అప్పటివరకూ గెలవని టెస్ట్ సీరిస్‌ను గెల్చిన కెప్టెన్. పాక్‌పై టెస్ట్ సీరిస్ గెలుపు.. ఐసీసీ క్రికెట్ ట్రోఫీలో ఒక కెప్టెన్ స్థానంలో ఇప్పటివరకూ తన రికార్డును ఇంకా ఎవ్వరూ చెరపలేని విధంగా ఆరు సెంచరీలు చేసిన కెప్టెన్.

అలాంటి గంగూలీ.. మ్యాచ్ విన్నింగ్ తర్వాత తన జెర్సీ విప్పి ఎగిరి గంతేసిన తీరు.. మాకే సవాల్ విసురుతారా.. భారత్ అంటే ఇదీ అన్నట్టుగా ఆ బెంగాల్ టైగర్ భావోద్వేగాలను ప్రదర్శించిన తీరు ప్రపంచ క్రికెట్ అంతా చూసి నివ్వెరపోయింది. అదే సమయంలో ఓపెనర్లుగా వీరేంద్ర సెహ్వాగ్, గంగూలీ మినహా.. ఆ తర్వాత వచ్చిన మిడిల్ ఆర్డర్ కుప్పకూలిపోతే ఆ తర్వాత వచ్చిన యువరాజ్, కైఫ్ చూపిన స్పిరిట్ ప్రపంచం మొత్తం అప్లాజ్ అందుకునే విధంగా చేసింది.

ఆరోజు ఊళ్లో కరెంట్ లేకున్నా భారత విజయంతో మా కళ్లల్లోని కాంతులతో ఊళ్లో వెలుగు నిండింది. సుమారు పాతిక సంవత్సరాల వయస్సులో క్రికెట్ పైనున్న పిచ్చితో.. రసవత్తరంగా సాగుతున్న మ్యాచులో విజయం ఇండియానే వరించాలన్న తాపత్రయంతో... మా స్వర్గీయ విశ్వన్న సార్ చేతిలో ఉన్న ఆ ట్రాన్సిస్టర్ కథ ఈరోజు మళ్లీ గుర్తుకొచ్చింది. సందర్భమేంటంటే భారత క్రికెట్‌కు వేగాన్ని నేర్పిన గంగూలీ పుట్టినరోజు (జులై 8)కు ఐదురోజుల తర్వాత.. అంటే జూలై 13న అందిన విజయపతాక కానుక కనుక!

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...




ధోని మూడు ఐసీసీ ట్రోఫీలు తెచ్చి ఉండొచ్చు రోహిత్ రెండు ఐసీసీ ట్రోఫీలు తెచ్చి ఉండొచ్చు.. కానీ భారత్ జట్టుకే కాదు యావత్ ఇండియా ప్రజల తెగువ, పొగరు క్రికెట్ ప్రపంచానికి చూపించింది మాత్రం గంగూలీనే.. ఇవాళ టీమ్ ఇండియా ఒక రిటైంగ్ వాల్‌లా కొలువు తీరిన భారత జట్టుకి పునాది వేసింది మాత్రం నువ్వే దాదా.. ముఖం మీద తిడితే తలదించుకుని వెళ్ళిపోయే రోజుల నుండి ఇండియా టీమ్ జోలికి, ఆటగాళ్లు జోలికి వెళ్తే తాట తీసేస్తారు అనుకునేలా ప్రపంచంలోనీ అన్ని జట్లు భయపడేలా చేసిన వ్యక్తి. మ్యాచ్ ఓడిపోయేలాగుంటే ఎదుటి టీంపై స్లెజింగ్ అస్త్రాన్ని ప్రయో గించి వాళ్లని దుర్భాషలాడుతూ రెచ్చగొట్టి మ్యాచ్లు గెలిచే ఆస్ట్రేలియా, ఇం గ్లాండ్ జట్టులు సైతం ఈరోజు ఇండియన్ టీం పేరు చెబితే ఒళ్ళు దగ్గర పెట్టుకొని ప్రవర్తించే స్థాయికి భారత జట్టును తీసుకొచ్చిన నాయకుడు. దెబ్బకు దెబ్బ అనే నినాదంతో లార్డ్స్‌లో అద్భుతాలు సృష్టించి టీషర్టు విప్పి ప్రతీకారం తీర్చుకోవడంలోనే కాదు మహేంద్రసింగ్ ధోని, హర్భజన్ సింగ్, యువరాజ్ సింగ్, జహీర్ ఖాన్ లాంటి ఎంతోమంది ప్రతిభవంతులు మొదట్లో విఫలమైనా సరే వరుస అవకాశాలు ఇచ్చి వారిలోని చఅద్భుతమైన ప్రతిభను బయటకు తీసుకొచ్చి ప్రపంచం ముందు విజేతలుగా నిలబెట్టిన విజయవంతమైన కెప్టెన్. పుట్టుకతోనే రాజ కుటుంబంలో పుట్టి అష్టైశ్వర్యాలతో పెరిగి బ్యాక్ గ్రౌండ్ వాడకుండా ప్రతి భతో భారత క్రికెట్లో చెరగని ముద్ర వేసి అభిమానుల దృష్టిలో యువ రాజుగా కొలువైన భారత క్రికెట్‌జట్టు మాజీ కెప్టెన్‌కి సొగసైన బ్యాటింగ్‌తో ఫ్రంట్ ఫుట్‌కి వచ్చి అతను కొట్టే సిక్స్‌ల కు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశ యోక్తి కాదు.



గురుపౌర్ణమి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు స్థానిక ఒక ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక గురువులను దర్శించుకుని, వారి ఆశీస్సులు అందుకుని వారిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పసుపులేటి సురేష్ సింగ్, పూజారి చెల్లయ్య, కనుగుల లలితకుమారి, బైపల్లి రాజేశ్వరి, చింతాడ భూషణరావు, లక్కీ, నల్లాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## దమ్మలవీధిలో గురుపౌర్ణమి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక దమ్మలవీధిలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కాకడహారతితో ప్రారంభమైన ప్రత్యేక పూజల్లో భాగంగా షిరిడిసాయి మూలవిరాట్ విగ్రహమునకు భక్తులచే పంచామృత అభిషేకాలు చేయించి అలంకరణ సేవ, దూపదీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఇప్పిలి రామకృష్ణ మాట్లాడుతూ మధ్యాహ్న హారతి, సాయంత్రం 4గంటలకు తిరువీధి ఊరేగింపు కార్యక్రమం, 6గంటలకు ఆలయ ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రంలో ఆలయ సేవకులు సోడవరం ఈశ్వరరావు, రాజు, షణ్ముఖరావు, ముత్యాలరావు, బాలు, సుందర్, రాము, ప్రకాష్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం సభ్యులు ఎల్లేటి రవికుమార్, కుప్పిలి శివ తదితరులు పాల్గొన్నారు.



## ఆ గ్రామాలను పంచాయితీలుగా మార్చాలి

(సత్యంన్యూస్,ఎచ్చెర్ల)



శ్రీకాకుళం కార్పొరేషన్‌లో భాగమైన ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం, తోటపాలెం గ్రామాలను పంచాయితీలుగా మార్పు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అమరావతిలో బుధవారం కలిసి వినతిపత్రం అందిం చారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో భాగంగా ఉన్న ఈ రెండు గ్రామాలను గెజిట్ నోటి ఫికేషన్ ద్వారా పంచాయతీలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవా లని మంత్రిని కోరారు. కార్పోరేషన్‌లో ఉన్న రెండు గ్రామాలు అభి వృద్ధికి నోచుకోవడం లేదని వివరించారు. పంచాయితీలుగా మారితే ఉపాది హామీ పథకం ద్వారా, ఆర్థిక సంఘం నిధులు ద్వారా అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పాటు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. ఎమ్మెల్యే చొరవకు కుశాలపురం, తోటపాలెం గ్రామాలకు చెందిన కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక గుజరాతీపేట బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉలిమిరి ప్రసాదరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, నేరెళ్ల సుబ్రమణ్యం, మర్ల రవికుమార్, నేరెళ్ల సాయి, విజయకుమార్, దర్భముళ్ల ఫణీంద్ర, కస్తూరి, సంతోష్‌కుమార్, దుర్గావఝుల ప్రసాద్, యామిజాల గాయత్రి, దూసి కామేశ్వరి, పెంట కిరణ్‌శర్మ, గన్నవరపు వెంకట క్రిష్ణారావులు పాల్గొన్నారు.

## రూ.20వేల ఆర్థికసాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పొందూరు మండలం దూసిపేట నివాశి పైడి.పద్మావతికి "హాయ్ ఫ్రెండ్స్ సేవా సంఘం" రూ.20 వేలు అర్థిక సాయం బుధవారం అందించారు. ఇన్ఫెక్షన్ కారణంగా కుడికాలును తొలగించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పద్మావతికి అండగా నిలవాలని ముందుకు వచ్చినట్టు అరసవల్లికి చెందిన కింతాడ సంతోష్ తెలిపారు. హాయ్ ఫ్రెండ్స్ సేవా సంఘం ప్రారంభించి ఐదునెలలు పూర్తి అయిందని అందులో భాగంగా ప్రతి నెలలో ఒక పేద కుటుంబానికి రూ.20వేలు అందిస్తున్నామని తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న పద్మావతికి దాతలు అదుకుని నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సిపాన శ్రీను, జి.తారక్, ఎస్.కేశవ్, బి.శ్రీను, పి.నాగరాజు, ఎస్.శ్రీను, పి.కిషోర్, దాడి సంతోష్, కె.పురుషోత్తం, దాసరి కిరణ్, అత్తిలి సతీష్, కాకర్ల నర్సింగ్, కె.హేమంత్, పి.గోవింద్, బి.చిన్నారావు, పి.అనంతరావు లాయర్ తదితరులు పాల్గొన్నారు.



## సాధింపులు, వేధింపులే.. ఆయనకు 'భూషణా'లు!

(మొదటిపేజీ తరువాయి)

పరపతి ప్రయోగించి ఉద్యోగాల నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని లింకు వర్కర్లు తమ ఫిర్యాదులో ఆరోపించారు. ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టుకు జిల్లా ఛైర్మన్ హోదాలో కలెక్టర్ చొరవ తీసుకుని నాగభూషణరావుకు మళ్లీ డీఆర్పీగా అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### మళ్లీ రావడానికి ప్రయత్నాలు

నాలుగేళ్లుగా విధులకు దూరంగా ఉన్నా కూడా లింక్ వర్కర్లను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగభూషణరావు మళ్లీ ఎలాగైనా అదే పోస్టులోకి రావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గత పదేళ్లుగా జిల్లాలోనే తిష్టవేసిన ఈయన గతంలో ఏపీశాక్స్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం)గా ఉమామహేశ్వరరావు ఉన్నప్పుడు అతని సహకారంతో తన కార్యకలాపాలు సాగించేవారు. ఇతనిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అవి పైస్థాయికి వెళ్లకుండా తన స్థాయిలోనే మాఫీ చేసేసేవారు. ఒకవేళ వెళ్లినా ఏపీశాక్స్ రాష్ట్ర కార్యాలయంలో కొన్నేళ్లుగా పనిచేస్తూ ప్రస్తుతం టీఐఎన్జీవో డైరెక్టర్‌గా అలాగే ఇన్‌ఛార్జి ఏపీడీగా పని చేస్తున్న కామేశ్వరప్రసాద్ అండదండలతో చర్యల నుంచి తప్పించుకుంటూ వచ్చారు. టీఐ ఎన్జీవో అంటే ఏపీశాక్స్‌కు అనుబంధంగా పని చేసే టార్గెటెడ్ ఇంట్రవెన్షన్ స్వచ్ఛంద సంస్థలు అని అర్థం. అంటే ఎయిడ్స్ నియంత్రణ కార్యకలాపాల్లో పాల్గొనే ఎన్జీవో సంస్థల పర్యవేక్షణ బాధ్యత ఈ కామేశ్వరప్రసాద్‌దే. వాస్తవంగా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఈయన చాలాకాలంగా డిప్యూటేషన్‌పై ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలో పని చేస్తున్నారు. ఆమధ్య డిప్యుటేషన్ గడువు ముగిసినా పరపతి ఉపయోగించి మళ్లీ పొడిగించుకుని ఇప్పుడు ఏకంగా ఏపీశాక్స్‌కు ఇన్‌ఛార్జి ఏపీడీగా, టీఐ ఎన్జీవో బాధ్యుడిగా వ్యవహరిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో చాలా కాలంగా పని చేసిన కామేశ్వరప్రసాద్‌తో అప్పట్లో ఉన్న పరిచయాలు, సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని నాగభూషణరావు తన పాపాలను మాఫీ చేయించుకుంటూ వచ్చారు. ఇప్పుడు తనపై వచ్చిన ఫిర్యాదులను కూడా అదేవిధంగా మాఫీ చేయించుకుని మళ్లీ ఛైల్డ్ ఫండ్ ఇండియా డీఆర్పీగా రావడానికి మంత్రాంగం నడుపుతున్నట్లు తెలిసింది. అందుకు తగినట్లే ఈయన్ను పక్కనపెట్టి నాలుగు నెలలైనా ఇప్పటివరకు ఆ స్థానంలో వేరొకరిని నియమించలేదు.















# ఆషాఢం సేల్

## శ్రీ వారాహి సిల్క్స్

కంచిపట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ధర్మవరం పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

మంగళగిరి పట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ఉప్పాడ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

బెనారస్ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

కుబేర పట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ఆర్‌గంజి పట్టు
(2000లకు పైగా డిజైన్స్)

కేటలాక్ శారీస్
(2000లకు పైగా డిజైన్స్)

ఫ్యాన్సీ శారీస్
(5000లకు పైగా డిజైన్స్)

డిజైనర్ శారీస్
(5000లకు పైగా డిజైన్స్)

వర్క్ శారీస్
(2500లకు పైగా డిజైన్స్)

ప్యూర్‌సిల్క్
(5000లకు పైగా డిజైన్స్)

ప్రింటెడ్ సిల్క్
(2000లకు పైగా డిజైన్స్)

లంగావోణీ సెట్లు
(2000లకు పైగా డిజైన్స్)

లెహంగాస్
(2000లకు పైగా డిజైన్స్)



రూ.5000/- షాపింగ్ చేయండి..




వెండి కాయిన్ పొందండి.

కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం